## మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన రైతు

- ప్రాణభయంతో గుడాటిపల్లి వాసి ఫిర్యాదు

**శెనార్తి మీడియా,శంకరపట్నం**

గుడాటిపల్లి గ్రామానికి చెందిన రైతు గుర్రం సంజీవరెడ్డి మంగళవారం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తనకు ప్రాణహాని ఉందంటూ, గుడాటిపల్లి వాసులు సింగిరెడ్డి పెద్ద మల్లారెడ్డి, ఆయన కుమారులు శ్రీధర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తిరుపతి రెడ్డిలపై కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.తన స్వంత భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నించగా వద్దన్న కారణంగా నలుగురు కలిసి దాడికి పాల్పడ్డారని, దాంతో మూడు నెలలపాటు మంచానికే పరిమితమయ్యానని తెలిపారు. వైద్యానికి 5 లక్షల ఖర్చు అయ్యిందని పేర్కొన్నారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని చెప్పారు.వీరంతా గ్రామం విడిచిపెట్టి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని, లేకపోతే చంపేస్తామంటూ దూషణలకు పాల్పడుతున్నారని విన్నవించారు. తన వ్యవసాయ భూమి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి ఆక్రమించారని, జెసిబి సహాయంతో పైప్‌లైన్‌ను పగలగొట్టి రూ.2 లక్షల ఆస్తి నష్టం కలిగించారని తెలిపారు. ఈ విషయమై హుజురాబాద్ రూరల్ సీఐ, కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

## ఘనంగా దాశరథి జయంతి ఉత్సవాలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాహిత్యాభిముఖత పెంచే ఉద్దేశంతో పద్యపఠన పోటీలు నిర్వహించారు.కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వి. సరిత అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ దాశరథి రచనలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ఆయన సాహిత్యం స్వాతంత్ర్య భావజాలాన్ని, సామాజిక చైతన్యాన్ని, తెలంగాణ ఉద్యమ తాత్వికతను ప్రతిబింబిస్తుందన్నారు.ఈ వేడుకల ద్వారా విద్యార్థుల్లో సాహిత్యంపై ఆసక్తి, దేశభక్తి, సంస్కృతి పట్ల గౌరవం పెరిగిందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజు, సతీష్ కుమార్, మహేందర్, రమణారెడ్డి, మధుకర్, కనకలక్ష్మి, నాగమణి, ఫర్హీన, సంధ్యా, ఆర్.రజిత, ఎస్.రజిత, అనిత, జ్యోతి తదితరులు సహకరించారు. విద్యార్థులు, సిబ్బంది భాగస్వామ్యం ప్రోగ్రాం కి శోభను తెచ్చింది.

## ఘనంగా గోరింటాకు పండుగ



**శెనార్తి మీడియా, తలమడుగు**

ఆషాడ మాసం పురస్కరించుకొని మంగళవారం తలమడుగు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం గ్రామ మహిళలు గోరింటాకు పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళ సంఘము నాయకురాలు కాటి పెల్లి సునీత రెడ్డి మాట్లాడుతూ మన సాంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు.. మహిళలు అందరూ కలిసి ఆలయంలో గోరింటాకు పండుగను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు... మహిళలు ఆలయానికి చేరుకొని రోలు రోకలిబండతో గోరింటాకు దంచారు. అనంతరం మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు అందరూ ఒకచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది.

## ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యుడిగా పెట్టెం నవీన్



**శెనార్తి మీడియా, కరీంనగర్:** తెలంగాణ స్టేట్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యునిగా కరీంనగర్ జిల్లా వాసి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెట్టెం నవీన్ నియమితులయ్యారు. మంగళవారం ట్రాన్స్ పోర్ట్ భవన్‌లో రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కె. సురేంద్ర మోహన్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా స్టేట్ కోఆర్డినేటర్‌గా పెట్టెం నవీన్ గారు వ్యవహరించి, పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించారు. సోషల్ మీడియా వేదికగా నాయకుల ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తలకు శిక్షణ సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యునిగా నియమించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా నవీన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల సంక్షేమమే ప్రాధాన్యం

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి..
- సాదాబైనమాల దరఖాస్తుల పరిష్కారానికి సిద్ధంగా ఉండాలి..
- విద్యా, భూ సమస్యల పరిష్కారంపై సమీక్ష..

**శెనార్తి మీడియా, హైదరాబాద్/ మంచిర్యాల**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయం నుంచి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అట్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, సిసిఎల్ఎ అధికారి లోకేష్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ఆహార నాణ్యత, ఆరోగ్యం, వసతులు, పారిశుధ్యం తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి పాఠశాలలు, వసతి గృహాలు పరిశీలించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టం కింద ఇప్పటివరకు 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిలో సాదాబైనమా, సర్వే నెంబర్ మిస్సింగ్, అసైనెడ్ భూములు, రెగ్యులరైజేషన్, వారసత్వ హక్కులకు సంబంధించినవి అధికంగా ఉన్నట్లు తెలిపారు. కోర్టు తీర్పుకు ఎదురుచూడకుండా సాదాబైనమా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి సిద్ధం కావాలని, అర్హులైన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల తిరస్కరణకు గల కారణాలను లిఖితపూర్వకంగా దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, అవసరమైన ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. నిర్మాణ సామాగ్రిపై రవాణా భారం పడకుండా దగ్గరలోనే ఉచితంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబితాల్లో లేనప్పటికీ అర్హులైన నిరుపేదలకు ఇండ్లు కేటాయించేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.వనమహోత్సవ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణల్లో మొక్కలు నాటాలని, ఖరీఫ్ పంట సీజన్‌కు అవసరమైన సౌకర్యాలు రైతులకు




సమకూర్చాలని చెప్పారు. పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో శాతం అడ్మిషన్లు పూర్తిచేయాలని, నాణ్యమైన శిక్షణ కల్పించాలని సూచించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణానికి చేసిన వెసులుబాటు విజయవంతమైందని, ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని తెలిపారు. దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీపై కూడా చర్యలు తీసుకోవాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అటవీ అధికారి శివ ఆశిష్ సింగ్, అదనపు కలెక్టర్ చంద్రయ్యలతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో విద్యార్థులకు సరైన ఆహారం అందుతోందో లేదో పరిశీలించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులతో మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో ఇసుక కొరత లేకుండా చూడాలని, భూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో సమగ్రంగా దరఖాస్తులను పరిశీలించాలని చెప్పారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, సీఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని, రేషన్ కార్డుల పంపిణీకి జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు డ్రైవ్ చేపట్టాలని వివరించారు.

## మరో ఉద్యమానికి సై అంటున్న ఉద్యమకారులు.!



**శెనార్తి మీడియా, శంకరపట్నం**

తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో ఎందరో ఉద్యమకారులు ఉద్యమంలో పాల్గొని తమ సర్వసమును ధార పోసి స్వరాష్ట్ర సాధనకై పోరాటం చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారుల అంశాలపై హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న కూడా ఉద్యమకారుల హామీలపై స్పష్టమైన ప్రకటన ఇవ్వకపోవడంతో ఉద్యమకారులు మరో పోరాటానికి సై అంటున్నారు.కావున ఈ ప్రభుత్వ వైఖరికి నిరసనగా హైదరాబాదులోని గన్ పార్క్ వద్ద మంగళవారం రోజున ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వం వీలైనంత తొందరగా ఉద్యమకారుల హామీలపై స్పష్టమైన ప్రకటన చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఉద్యమకారులు రాష్ట్ర సర్కార్ రేవంత్ రెడ్డిని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సలహాదారులు ఓరుగంటి ఆనంద్, కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమార స్వామి, రాష్ట్ర మహిళా నాయకురాలు ఐల ప్రసన్న, శంకరపట్నం మండల అధ్యక్షులు దేవునూరి అంకుష్, జిల్లా నాయకులు కూనమల్ల మల్లేశంజిల్లా, నాయకులు తాటిపల్లి శంకర్, మామిడి మొగిలి, రావులకారి శ్రీధర్ లతోపాటు జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా గృహాల కేటాయింపు..

- పారదర్శకంగా గృహాల కేటాయింపు..

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



సింగరేణి ఉద్యోగుల గృహాల కేటాయింపు కౌన్సిలింగ్ పారదర్శకంగా నిర్వహించినట్టు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. మంగళవారం పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో జరిగిన కౌన్సిలింగ్‌లో 100 గృహాలు కేటాయించగా, 275 మంది కార్మికులు దరఖాస్తు చేసినట్టు ఏరియా ఎస్ఓటు జీఎం విజయ్ ప్రసాద్ తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన గృహాలు కేటాయించామని వెల్లడించారు. ఈ కౌన్సిలింగ్‌లో ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందర్, ఎస్ఇ ఐఈడీ కిరణ్, సివిల్ ఎస్ఇ శ్రీధర్, సీనియర్ పిఓ కార్తీక్, రాజలింగు (ఒ.ఎస్) పాల్గొన్నారు.

## త్రినాథ్ దత్తుకు అభినందనలు

- అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా బాధ్యతలు స్వీకరణ



**శెనార్తి మీడియా, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన త్రినాథ్ దత్తును మంగళవారం పలువురు అభినందించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను త్రినాథ్ దత్తు స్వయంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి తరఫున ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. త్రినాథ్ దత్తు సమర్థవంతమైన సేవలతో ప్రజాసేవలో పరిపూర్ణత సాధించాలని, కార్మికుల హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తా జా బాధ్యతలలో విజయవంతంగా రాణించాలని, టీఎన్జీవో సంఘం పూర్తి మద్దతుగా వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు కోమ్మెర శ్రీనివాస్ రెడ్డి, ఆరవెళ్ళి రాజేశ్వరరావు, పవన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

## నేడు ఇందిరా మహిళా శక్తి సంబరాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మందమర్రి మండలంలోని అందుగులపేట సాయిమిత్ర గార్డెన్‌లో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించనున్నట్లు తహసిల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. ఈ సంబరాల్లో భాగంగా మండలానికి చెందిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## అట్టహాసంగా బోనాల ఉత్సవం



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల పట్టణంలోని రాజీవ్ నగర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం బోనాలు, మెహందీ పండుగలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ముత్యం బుచ్చన్న మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించామని తెలిపారు. బోనాలు పండుగను మహంకాళి దేవికి అంకితంగా, కృతజ్ఞతా సూచకంగా ఆషాఢ మాసంలో జరుపుకుంటారని వివరించారు.వీధులనిండా సందడిగా, పాటలతో నృత్యాలతో విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేయగా, గోరింటాకు, మెహందీ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ సేవలు 4జి లోకి అప్డేట్



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

అదిలాబాద్ రూరల్ మండలం వాన్ వట్ లోగల బిఎస్ఎన్ఎల్ టవర్ లో కొత్త బ్యాటరీలతో పవర్ ప్లాంట్ ఇన్స్టాల్ చేసి, బిఎస్ఎన్ఎల్ సేవలు 4జీ లోకి అప్డేట్ చేయడం జరిగిందని బిఎస్ఎన్ఎల్ అదిలాబాద్ ఏజీఎం ఎస్ శివ నాగేశ్వర్ రావు తెలిపారు. సోమవారం డి ఎస్ ఎల్ చంద్రశేఖర్, ప్రమోద్ కుమార్, జేఈ దత్త కుమార్ లతో కలిసి వాన్ వట్ లోని సెల్ టవర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాన్ వాట్, మామిడిగూడు, లింగుగూడ, పిప్పలదరి గ్రామాలకు ఎలాంటి అంతరాయం లేకుండా 4g సేవలు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. త్వరలో ఆయా గ్రామాలలో ఉచితంగా 4g సిమ్ కార్డులు అందజేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ 4జి సిమ్ కార్డులు తీసుకొని సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## జిల్లా కార్యదర్శిగా కసిబోజుల సంతోష చారి



**శెనార్తి మీడియా, కరీంనగర్:** తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా కసిబోజుల సంతోష చారిని నియమించారు. జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా సంతోష చారి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నిక ప్రక్రియలో సహకరించిన కార్మిక నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.